

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## క్వీన్ బీ

**ఇంటి** బయట కారాగిన చప్పుడు, తలుపు తెరిచి మూసిన చప్పుడు వంటగదిలోకి వినిపించాయి. పూరీపిండి కలుపుతున్న సుమిత్ర తలని వంచి ముందు గదిలోకి చూసి ఏదో గొణిగింది.

బంగాళా దుంపల తొక్కు తీస్తున్న నేను అర్థంకాక అడిగాను. "ఎవరొచ్చారు?"

సుమిత్ర జవాబివ్వలేదు. నేను కుతూహలంగా సుమిత్రలాగే డ్రాయింగ్ రూంలోకి చూసాను. 35-40 మధ్య వయసున్న ఓ యువతి విలాసంగా కూర్చుని సుమిత్ర భర్త ప్రసాద్‌తో మాట్లాడుతోంది. ఆమె తెల్లటి పల్చని చీర, గులాబీరంగు మీద అద్దాలు కుట్టిన స్లీవ్‌లెస్ బ్లౌజ్ వేసుకుంది. ముఖం లైట్ వెలుగుతో తళతళలాడుతోంది. అందం, దానికన్నా ఎక్కువగా ప్రదర్శన వెరసి ఆ యువతి మగాళ్ళకి నచ్చేలా ఉంది.

"ఎవరీమె? మన ఏజ్ ఉంటుంది కాని ఆ మెయిన్‌టెనెన్స్ చూడు. మనమూ ఉన్నాం ఎందుకు?" చిన్నగా నిట్టూర్చాను.

"ఛీ ఛీ! దాంతో పోలికా మనకి?" సుమిత్ర ఛీత్కారంగా చెప్పింది.

"అయ్యో! అదేంటి సుమీ? అదీ ఇదీ అని సంస్కారంలేకుండా మాట్లాడుతున్నావు?" నొచ్చుకుంటూ చెప్పాను.

"దాని సంగతి తెలిస్తే నువ్వింకా తిడతావు. నేను కాబట్టి ఇక్కడితో ఆగిపోయాను" సుమిత్ర కోపంగా చెప్పింది.

"ఇంతకీ ఈ జాంపండు ఎవరో చెప్పనేలేదు?"

"అది జాంపండుకాదు. వైరస్. బేక్టీరియా, సంసారాలు నాశనం చేసే బేక్టీరియా" సుమిత్ర గొంతు తగ్గించి తీవ్రంగా చెప్పింది.

"సరే సరే. ఎవరామె? ఎక్కడో చూసినట్లుంది. కొంచెం ఇంట్రస్టింగ్‌గా ఉంది" మళ్ళీ అడిగాను.

"ఆడదానివి. నీకే అంత ఇంట్రెస్ట్ ఉంటే, మరి మగాళ్ళ సంగతేంటి?" సుమిత్ర కోపంగా అడిగింది. తర్వాత చెప్పింది.

"రేఖారాణి. దానికో సాంస్కృతిక సంస్థ ఉంది. కళాకారులకి బిరుదులు, సన్మానాలు చేస్తారే అలాంటిది. దానికోసం ఫండ్స్ సేకరణకి సీతాకోక చిలకలా తిరుగుతూంటుంది. సెన్సార్ బోర్డ్ మెంబర్ కూడా అందుకు కావల్సిన అర్హతలు లేకపోయినా ఆ హొయలే అర్హతలు."

"ఓ! టి.విలో ఏదో అవార్డ్ ఫంక్షన్‌లో చూసినట్లున్నా" చెప్పాను.

"మరింక పనేం వుంది? నిద్రలేవగానే 'నగరంలో ఈనాడు' చూడటం ఎక్కువ మంది సెలబ్రిటీస్ వచ్చేదాన్ని సెలక్ట్ చేసుకుని వెళ్ళడం"

నేను లేచి చేతులు కడుక్కుని సుమిత్ర చెయ్యిపట్టుకుని బెడ్రూంలోకి తీసుకెళ్ళాను. తనని మంచం మీద కూర్చోపెట్టి అడిగాను.

"సుమీ మనిద్దరం చిన్నప్పటినించీ ఫ్రెండ్స్. ఏమైందో నాకు చెప్పు. ఈ మధ్య నేను మీ ఇంటికి వచ్చిన ప్రతీసారి నిన్ను అడుగుతూనే ఉన్నాను. 'ఎందుకలా ఉన్నావు?' అని. దానికి, ఈ రేఖారాణికి ఏదో సంబంధం ఉందనిపిస్తోంది. ప్లీజ్! నేనెవరికీ చెప్పనని నీకు తెలుసు."

"శతాబ్దాల కథే రూపా. మా వారు కల్చరల్ డిపార్ట్‌మెంట్‌లో పి.ఆర్.వో అయినప్పటినించి ఈ రేఖారాణి ఆయన చుట్టూ తిరుగుతోంది. మొదట్లో ఆవిడ గురించి చులకనగా చెడ్డగా చెప్పేవారు. తర్వాత ఆమె మాటలు, చేష్టలు ఎంజాయ్ చేయడం మొదలుపెట్టారు. మన వయసే అయినా శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకుని, అతి పల్చటి దేవతా వస్త్రాలని ధరించి ఆమె మగాళ్ళముందు విలాసంగా కూర్చుని కబుర్లు చెప్తూంటే ఆ వలలో పడని వాళ్ళు అరుదు. ఇదివరకు ఆఫీసులో కలుసుకునేది. ఇప్పుడు ఇంటికే వస్తోంది. వచ్చిందంటే రెండుమూడు గంటలదాకా వెళ్ళదు. మొదట్లో కాఫీలు, ఫలహారాలు ఇచ్చేదాన్ని పిచ్చిదాన్ని. తర్వాత మానేసాను. ఆ టైంలో మా రాజాని చదివించుకుంటే టైం సద్వినియోగం అవుతుందనుకున్నాను. ప్రసాద్ కూడా మారిపోయారు. రాత్రుళ్ళు గంటలతరబడి ఫోన్లు అదేమంటే, పెన్ను కనిపించలేదనో, సోఫాలో నేప్కిన్ ఉందనో వంకపెట్టి అరుస్తున్నారు. ఇదివరకు మా మధ్య ఈ అరుపులు లేవు. అంతా దానిమూలంగానే." సుమిత్ర కళ్ళుతుడుచుకుంది.

"అన్నన్ని గంటలు మాట్లాడడానికి ఏముంటాయి?" నేను చిత్రంగా అడిగాను.

"నేనూ అలాగే అనుకుని ఓసారి విన్నాను. ఛీ! బూతు జోకులు. ఎంత ఫ్రెండ్స్‌మైనా మనిద్దరం ఎప్పుడూ అలాంటి జోక్స్ చెప్పుకోలేదు. పరాయి మగాడి ముందు కూర్చుని బూతు జోకులు చెప్తూ తను నవ్వుతూ, నవ్విస్తూంటుంది. ప్రసాద్ వాటిని బాగా ఎంజాయ్ చేస్తున్నాడు. అదే ఈ పతివ్రత పెళ్ళాం ఏకాంతంలో అలా మాట్లాడినా చెంప పగలకొడతాడు. అవి జోక్స్‌లా కూడా ఉండవు. నిజంగా జరిగినట్లే చెప్తుంది. పాత్రలన్నీ వివిధరంగాల్లో పేరున్న ప్రముఖుల పాత్రలే. ఆ నయగారాలు చూడాలి" సుమిత్ర మొహం ఎర్రబడింది.

"ఏం చేస్తుంది?"

"నువ్వు, ప్రసాద్ ఒకసారి కాఫీ కప్పుని అందుకోవాలని వంగితే మీ తలలు ఢీ కొట్టుకున్నాయి. అప్పుడు నువ్వేం అంటావు?"

"సిగ్గుపడి, 'సారీ అండీ' అని చెప్పి దూరం జరుగుతాను" చెప్పాను.

"అదేం చేస్తుందో తెలుసా? నుదుటిమీద సుతారంగా రుద్దుకుంటూ "ప్రసాద్‌గారూ...." అని గారంగా పిలుస్తూ వయ్యారాలు పోతుంది. నా పిచ్చి మొగుడుదానికి ఉబ్బి తబ్బిబ్బై తనూ సరసంగా చూడడానికి ప్రయత్నిస్తాడు. ఇవన్నీ చూడలేక నేను ఆవిడ వచ్చినప్పుడు బయటకి వెళ్ళడం మానేసాను. ఆవిడా పట్టించుకోలేదు. అసలావిడకి ఆడవాళ్ళు ఎలర్జీ కూడా. మంచి పొజిషన్‌లో ఉంటే తప్పించి" నాకు ఏం చెప్పాలో తోచలేదు.

ఆ తర్వాత నేను రేఖారాణి వార్తలని జాగ్రత్తగా ఫాలో అయ్యాను. ఆవిడ సొసైటీ లేడీ. సాంస్కృతిక సంస్థలు, సేవా సంస్థలు ఇంకా చాలావాటిలో సభ్యురాలు. భర్త గురించి ఎక్కడా రాయలేదు. ఆ అనామకుడు పాపం ఎంత బాధపడితున్నాడో అనుకున్నాను.

ఓ మధ్యాహ్నం సుమిత్ర నించి ఫోన్ వచ్చింది.

"రూపా నేను మన ఊరు వెళ్ళిపోతున్నాను. నువ్వు నాకోసం ఆ ఇంటికి వస్తావేమో రావద్దని చెప్పడానికి ఫోన్ చేసాను" చెప్పింది.

"వెళ్ళిపోతున్నావా? అదేంటి?" అయోమయంగా అడిగాను.

"అవును. పొద్దున ప్రసాద్‌తో చాలా గొడవైంది. వెళ్ళిపోతున్నా. విడాకులు తీసుకుంటా."

"అయ్యో! సుమీ నేను వస్తా. ఒక్క నిమిషం ఆగు" కంగారుగా చెప్పాను.

"నేను ఆల్‌రెడీ బస్‌లో ఉన్నాను. నేను చెప్పేది విను. సిగ్నల్ పోతే మాట్లాడలేను."

"ఓ.కే ఓ.కే. ఏమైంది చెప్పు"

"నిన్న నేను వంటగదిలో పనిచేసుకుంటున్నాను. ఎప్పట్లాగే అది వచ్చింది. నేను పట్టించుకోలేదు. రాజా డైనింగ్ టేబుల్ మీద కూర్చుని హోం వర్క్ చేస్తున్నాడు. నేను మధ్యలో ఎందుకో వాడివైపు చూస్తే, వాడు నోరు తెరుచుకుని డ్రాయింగ్ రూంలోకి చూస్తున్నాడు. ఎందుకో అర్థంకాక చూస్తే ప్రసాద్, రేఖారాణి ఒకరికొకరు ద్రాక్షపళ్ళు నోటికి అందించుకుంటూ, సినిమాల్లోలా ద్రాక్షపళ్ళ గుత్తిని ఒకరు గాల్లో ఉంచితే, రెండోవాళ్ళు అందుకుంటూ.. ఛఛ నేను వాడిని కిచెన్‌లోకి తీసుకువెళ్ళాను. పిల్లవాడి ముందు గొడవలు ఎందుకని రాత్రంతా ఉగ్గబట్టుకుని ఉండి, పొద్దున వాడు స్కూల్‌కి వెళ్ళగానే చెప్పాను. 'దాన్ని ఇంక ఇంటికి రానివ్వను.'

"ఇది నా ఇల్లు" ప్రసాద్ వెంటనే చెప్పాడు.

"ఆ నిమిషంలోనే నా మనసు విరిగిపోయింది. ఇన్నేళ్ళూ చాకిరిచేసి ఆ ఇంటిని నిలబెట్టిన నాకు ఆ సమాధానం ఎంత బాధని కలిగించిందో. ఓ గంటలో నా వస్తువులన్నీ సర్దుకుని, రాజా స్కూల్‌కి వెళ్ళి టి.సి తీసుకుని వాడ్ని తీసుకుని వెళ్ళిపోతున్నాను. నాన్నతో మాట్లాడి విడాకులకి అప్లై చేస్తాను."

"సుమీ! ఏమిటే ఇది" దుఃఖంగా అరిచాను. సిగ్నల్ లేక ఫోన్ కాల్ కట్ అయింది.

పదిరోజుల తర్వాత సుమిత్రనించి మెసేజ్ వచ్చింది. 'రేఖారాణి ప్రసాద్‌కి చెల్లెలులాంటిదట!' పక్కనే కన్నీళ్ళు వచ్చేదాకా నవ్వే బొమ్మ ఎమోజీ.

ఆరునెలల్లో వాళ్ళు విడాకులు తీసుకున్నారు. సుమిత్ర ఏదో చిన్న ఉద్యోగంలో చేరానని చెప్పింది.

మా వారు ఎక్కువమందిని పాలసీ హోల్డర్స్‌గా మార్చినందుకు సంతోషించిన వాళ్ళ బాస్ మా ఇద్దరికీ థాయ్‌లాండ్ వారం రోజుల ట్రిప్‌ని ఇన్సెంటివ్‌గా ఇచ్చారు.

ఆ ట్రిప్‌లో భాగంగా బేంకాక్‌లో తిరుగుతూంటే, ఓ హోటల్‌లో స్విమ్మింగ్ పూల్ పక్కన పూల్ ఛైర్లో కూర్చున్న ఒకతను కనిపించాడు.

మా వారు వెంటనే "హలో గోపీగారూ" అంటూ అతని దగ్గరకి వెళ్ళాడు. అతను మమ్మల్ని చూసికొద్దిగా ఉలిక్కిపడి, అతిగా ఇబ్బంది పడి 'హలో' అని గొణిగాడు.

"ఈయన గోపీనాథ్‌గారు.." నాకు ఆయన్ని పరిచయం చేస్తున్న మావారు, ఒకావిడ చేతిలో రెండు బీర్ బాటిల్స్‌తో అక్కడికి రావడం చూసి ఆగిపోయారు.

ఆమెని చూసి నేను నిర్ఘాంతపోయాను. రేఖారాణి!

"ఎవరు మీరు?" ఆమె మావంక చూసి అడిగింది.

"ఫ్రెండ్" గోపీనాథ్ గొణిగాడు.

"ఓ! మావారికి ఫ్రెండ్స్ అంటే నాకు ఫ్రెండ్సే. ఏం చేస్తూంటారు?" ఆసక్తిగా అడిగింది.

"ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలో" మావారు చెప్పారు.

ఆమెకి అది ఆసక్తి లేని ఉద్యోగం కాబట్టి గోపీనాథ్‌తో చెప్పింది.

"ఏమండీ! మనం ఇక వెళ్దామా? బీచ్‌కి వెళ్దామనుకున్నాంగా?"

"యా...యా..." అతను లేచాడు.

అతని నడుం చుట్టూ చెయ్యి వేసి రెండో చేతిలోని బీర్‌ని చప్పరిస్తూ రేఖారాణికి వెళ్ళిపోయింది.

"ఏమండి అంటుందేమిటి?" మా వారు తెల్లబోతూ అడిగారు.

"ఆయన ఏం చేస్తారు? ముందు అది చెప్పండి" అడిగాను.

"సమాచార శాఖ డైరెక్టర్"

"అదీ సంగతి. నాకర్థమైంది" చెప్పాను.

"ఏమర్థమైంది? ఏమండి అందేమిటి?"

"మావారు అనికూడా అంది"

"అదే ఎందుకు?"

"ఎందుకేముంది? మీ గోపీనాథ్ మిస్టర్ రేఖారాణి కాబట్టి" చెప్పాను.

"రేఖారాణి? అంటే మీ సుమిత్ర..?" సందేహంగా అడిగారు.

"అవును. సుమిత్ర ఇప్పుడలా చిన్న ఉద్యోగం చేసుకుంటూ పిల్లాడ్ని చదివించుకుంటుందంటే, దానికి కారణం ఈ రేఖారాణి. ఈవిడగారు ప్రసాద్‌ని వదిలేసి, ఈ గోపీనాథ్ మీద వలేసిందన్నమాట. ఇంకో ముందడుగు కూడా వేసింది 'మావారు' అంటూ" చెప్పాను.

"ఛ! ఆయన్ని పలకరించక పోతే బావుండేది. ఎప్పుడూ అభిమానంగా మాట్లాడేవాడు ఎందుకింత ముభావంగా ఉన్నాడా అని కూడా ఆలోచించలేకపోయాను" మా వారు తనని తను తిట్టుకున్నారు.

"ఇంతకీ ఈ గోపీనాథ్ మీకెలా తెలుసు?"

"మన బస్టాప్ పక్కన రత్నా సూపర్ మార్కెట్ ఉందిగా. దాని ఓనర్ సుబ్బారావుగారి అల్లుడు. ఇతని భార్య రత్నమాలని కూడా రెండు మూడుచూసాను. బానే వుంటుంది పాపం."

"మన ఊరు వెళ్ళగానే మీరు అర్జెంట్‌గా ఆ సుబ్బారావుగారి దగ్గరకి వెళ్ళి అమ్మాయితో అల్లుడి విహారయాత్ర గురించి చెప్పండి" కసిగా చెప్పాను.

"ఏదో హలో అంటే హలోనే కాని వాళ్ళ దగ్గర నాకంత చనువులేదు. నేను చెప్పను" ఆయన నిరాకరించారు.

పత్రికల్లో, పేపర్లలో అడపాదడపా రేఖారాణి వార్తలు చూస్తూనే ఉన్నాను. చూసినప్పుడల్లా సుమిత్ర గుర్తొచ్చి కోపంగా పేపర్ మూసేస్తాను.

ఓ రోజు పొద్దున్నే సుమిత్రనించి ఫోన్ వచ్చింది.

"ప్రసాద్‌ని సాలార్జంగ్ మ్యూజియంకి మార్చారుట. దాంతో రేఖారాణి రావడం మానేసిందిట. తిరిగి కలిసి కాపురం చేద్దామని మేనమామని మధ్యవర్తిగా పంపాడు."

"అయ్యో పాపం!"

"ఫోన్ పెట్టేయనా?"

"వద్దొద్దు. పాపం కాదు. చెప్పు." బతిమాలాను.

"నేను వెళ్ళనని చెప్పాను. రాజాకి తండ్రి ప్రేమని దూరం చేస్తున్నానని తెలుసుకొని వాడి ముందే పరాయిదానితో సరసాలాడే తండ్రి కొడుక్కి ఏ ఆదర్శాలు నేర్పగలడు?"

"హుం" ఏం మాట్లాడాలో అర్థంకాలేదు. నాకు.

"రూపా! ప్రసాద్ ఆ ఒక్క మాట అనకుండా వుంటే బహుశా మళ్ళీ అతనితో కాపురం చేసేదాన్నేమో!"

"ఏది? ఇది నా ఇల్లు అన్నమాటా?"

"కాదు. రేఖారాణి చెల్లెలితో సమానం అన్నమాట."

సుమిత్ర ఫోన్ పెట్టేసింది.

నేను బయటకి వచ్చి బాల్కనీలో పడ్డ పేపర్‌కి కట్టిన పురికొసని విప్పి గుండ్రంగా చుట్టిన పేపర్ని తెరిచాను. ప్రముఖ సంఘసేవిక రేఖారాణికి పద్మశ్రీ ప్రకటించారు. నేనాపేపర్ని అక్కడే పారేసి కిచెన్‌లోకి నడిచాను.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments